TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02 సంచిక : 34 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శుక్రవారం.04.09.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## తెలంగాణ మంత్రి కొండా సురేఖ వివాదం – బర్తరఫ్ చేయాలని గవర్నర్కు సీఎం రేవంత్ లేఖ



హైదరాబాద్ అమృత్ తెలంగాణ: తెలంగాణ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ లేఖను ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌కు పంపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడం ఖరారైంది. అంతకుముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్కు పంపిన లేఖలో స్పష్టం చేశారు.

ఆ లేఖకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపితే కొండా సురేఖ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ కానున్నారు. దీంతో ఆమె సాధారణ ఎమ్మెల్యేగా కొనసాగాల్సి ఉంటుంది. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి లేఖ రాశారు. దీంతో దిల్లీలో 2 రోజుల పాటు జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది.

సీఎం, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణ : సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటు చేసుకుంది. క్రమశిక్షణారాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో–కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.

సురేఖపై చర్యలు తీసుకునే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉందన్న వార్తల మధ్య తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ తాజా నిర్ణయం తీసుకున్నారు. అయితే, సురేఖ రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఒకవేళ పార్టీ అధిష్టానం నిర్ణయిస్తే తనను తొలగించవచ్చని సవాలు విసిరారు.

హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న రేవంత్ : ఇదిలా ఉండగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుంచి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ–సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ ఎదురుదాడి : తనను పదవి నుంచి తొలగించేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్న తరుణంలోనే, కొండా సురేఖ రేవంత్ రెడ్డిపై ఎదురుదాడికి దిగారు. బుధవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన అనంతరం సురేఖ విలేకరులతో మాట్లాడుతూ, తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని భావిస్తే, ముందుగా పార్టీ ముఖ్యమంత్రి ప్రవర్తనను పరిశీలించాలని అన్నారు. తాను పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను, అలాగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రశ్నించారు. "నాకు షోకాజ్ నోటీసు జారీ చేసే ముందు, అది ముఖ్యమంత్రికి జారీ చేయాలి" అని ఆమె అన్నారు.

కీలక పదవుల్లో మార్పులు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు.

## కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయంకృతాపరాధం: ఆది శ్రీనివాస్

సురేఖకు పార్టీ, ప్రభుత్వం ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న శ్రీనివాస్

అవకాశాలను ఆమె సద్వినియోగం చేసుకోలేదని వ్యాఖ్య

కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో విఫలమయ్యారని ఆరోపణ



హైదరాబాద్ , అమృత్ తెలంగాణ: : మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. అలాగే, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించబడిన సీనియర్ నేత జి. చిన్నారెడ్డి అంశాన్ని కూడా ఈ సందర్భంగా విప్ ప్రస్తావించారు. చిన్నారెడ్డి అంటే సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవమని, గతంలో ఆయన గెలుపు కోసం రేవంత్ రెడ్డి శ్రమించారని గుర్తుచేశారు. అయితే ఎంతటి సీనియర్ నాయకులైనా సరే... పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్ఠానం తేల్చిచెప్పినందుకే ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## 'మంత్రి' రాజీనామా చేయకపోతే తొలగించవచ్చా? – 'బర్తరఫ్' అంటే?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో రాష్ట్రపతి, గవర్నర్లకు ప్రత్యేక అధికారాలు - 'వారు' చెప్పారంటే 'వీరు' సరే అనాల్సిందే!



హైదరాబాద్, అమృత్ తెలంగాణ: రాజకీయ విబేధాలు వచ్చినా, పార్టీ లైన్ దాటి ప్రవర్తించినా, అవినీతి, నేరారోపణలు వచ్చినా, పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించిన నేతలను రాజీనామా కోరడం సహజం. అందుకు 'ససేమిరా' అంటే బర్తరఫ్ చేస్తుంటారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ అనే పదం బ్రేకింగ్ వార్తగా తెలుస్తోంది. ఆమె రాజీనామా చేయని పక్షంలో బర్తరఫ్ చేస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బర్తరఫ్ అనే పదం అర్థం ఏమిటి? బర్తరఫ్ చేసే అధికార గవర్నర్కు ఉందా? ఏ సమయంలో బర్తరఫ్ చేస్తారో తెలుసుకుందాం. బర్తరఫ్ అనేది పార్శీ, ఉర్దూ భాషల నుంచి ఆవిర్భవించినట్లు తెలుస్తోంది. బర్, తరఫ్ అనే రెండు పదాల కలయికే బర్తరఫ్. తెలుగులో 'పక్కన పెట్టడం' అనే అర్థాన్నిస్తుంది. అంటే ఉద్యోగం లేదా పదవి నుంచి తొలగించడాన్ని బర్తరఫ్ అంటారు.

గవర్నర్ ఎలా తొలగిస్తారు?

కేంద్రంలో రాష్ట్రపతి, రాష్ట్రంలో గవర్నర్లకు రాజ్యాంగం కొన్ని విశేష అధికారాలను కల్పించింది. రాష్ట్రంలో ఆర్టికల్ 164 ప్రకారం రాష్ట్ర మంత్రులు గవర్నర్ విశ్వాసం ఉన్నంత వరకు పదవిలో కొనసాగుతారు. అలాగని గవర్నర్ తన సొంతంగా కాకుండా ముఖ్యమంత్రి సలహా, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటారు. అదే విధంగా కేంద్రంలో ఆర్టికల్ 75 ప్రకారం ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగి లేదా పదవుల్లో ఉన్న వారు ప్రభుత్వ లేదా తమ నిర్ణయించిన అంతర్గత పాలసీలకు విరుద్ధంగా వ్యవహరించినపుడు సహజంగా రాజీనామా చేయాలన్న ఒత్తిడి వారిపై ఉంటుంది. అందుకు వారు అంగీకరించకపోతే బలవంతంగా పక్కన పెట్టాల్సిన పరిస్థితినే బర్తరఫ్ (పక్కన పెట్టడం) అంటారు. ఇపుడు తెలంగాణలో ఇదే పేరు వినిపిస్తోంది. మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేస్తారని, ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్కు లేఖ రాశారని సమాచారం. మంత్రి మండలి నాయకుడిగా కేంద్రంలో ప్రధానమంత్రి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తుంటారు. ఎవరినైనా, ఏదైనా కారణంతో మంత్రి మండలి నుంచి తప్పించాలనుకుంటే రాజీనామా చేయాల్సిందిగా కోరుతారు. ధిక్కరిస్తే బర్తరఫ్ ఆయుధంగా వాడుకుంటారు. ఈ మేరకు రాష్ట్రంపతి లేదా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేస్తారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు నడుకోకపోవడం, పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరించడం, అవినీతికి పాల్పడడం, కుంభకోణాల్లో పోలీసులు అరెస్టు చేయడం తదితర పరిస్థితుల్లో రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఉంటుంది.

## బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు: కొండా సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమన్న శ్రీనివాస్ గౌడ్

ఈ కఠిన నిర్ణయం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచన ఉందని మండిపాటు

ఎంతోమంది కాంగ్రెస్ నేతలు రేవంత్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్య



హైదరాబాద్ , అమృత్ తెలంగాణ :తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

## అనిశ్చితి, సవాళ్ల మధ్య భారత్ ఆర్థిక వృద్ధి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: భారత్ మరియు బెల్జియం దేశాలు వాణిజ్యం, రక్షణ, క్రిటికల్ మినరల్స్, హరిత ఇంధనం, మరియు సాంకేతిక రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ల మధ్య జరిగిన విస్తృత స్థాయి చర్చల అనంతరం ఇరు దేశాలు సంయుక్తంగా కీలక ప్రకటన చేశాయి. సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, సవాళ్ల మధ్య భారత్ సాధిస్తున్న ఈ వేగవంతమైన పురోగతి అంతర్జాతీయ రంగానికి ఆత్మవిశ్వాసాన్ని నింపడమే కాకుండా కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు.

రక్షణ మరియు సాంకేతిక రంగాల్లో బలపడుతున్న భాగస్వామ్యంరక్షణ రంగం


భారత్–బెల్జియం సహకారం సంప్రదాయ రంగాలను దాటి రక్షణ పరికరాల తయారీ వరకు విస్తరించిందని, 'జొరావర్ ట్యాంక్' వంటి ఆధునిక వ్యవస్థల విషయంలో కూడా భాగస్వామ్యం కొనసాగుతోందని ప్రధాని వెల్లడించారు. సెమీకండక్టర్లు: సెమీకండక్టర్ల రంగంలో బెల్జియం వద్ద ఉన్న సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి తయారీ సామర్థ్యాలు పరస్పర ప్రయోజనకరంగా పనిచేస్తాయని తెలిపారు. గ్లోబల్ సప్లై చైన్, ఆహార, ఇంధన భద్రతలపై అంతర్జాతీయ ఘర్షణల ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతాల్లో కొనసాగుతున్న పోరాటాలకు వీలైనంత త్వరగా ముగింపు పలకాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, శాంతి చర్చలు మరియు దౌత్య మార్గాల ద్వారా సమస్యల పరిష్కారానికి జరిగే ప్రయత్నాలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని ప్రధాని స్పష్టం చేశారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. కీవ్‌లో భారత్ కీలక ప్రకటన

అమృత్ తెలంగాణ: రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ తన వంతు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. యుద్ధానికి ముగింపు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన పిలుపును ఆయన ప్రస్తావించారు. గురువారం కీవ్‌లో ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో సమావేశమైన సందర్భంగా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2022లో మొదలైన రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి ప్రవేశించిందని జైశంకర్ అన్నారు. రోజూ యుద్ధం కొనసాగితే మరిన్ని ప్రాణాలు పోవడంతో పాటు భారీ విధ్వంసం జరుగుతుందని పేర్కొన్నారు. సమస్యకు పరిష్కారం యుద్ధభూమిలో దొరకదని భారత్ మొదటి నుంచి చెబుతోందన్నారు. యుద్ధంలో ఉన్న ఇరు దేశాలే పరిష్కార మార్గాన్ని కనుగొనాల్సి ఉన్నప్పటికీ, భారత్ ఏ విధంగానైనా సహాయం చేయగలిగితే అందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. తన కీవ్ పర్యటనకు ద్వైపాక్షిక సంబంధాలే ప్రధాన ఉద్దేశమైనప్పటికీ, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని జైశంకర్ చెప్పారు. రెండు రోజుల క్రితం కీవ్‌లో జరిగిన దాడిలో ఓ భారతీయుడు మరణించడంపై విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. యుద్ధ ప్రభావంతో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయని జైశంకర్ చెప్పారు. వివిధ దేశాల నౌకల్లో భారతీయ నావికులు పనిచేస్తున్నారని, వారిలో కొందరు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నౌకాయానంపై యుద్ధ ప్రభావం గ్లోబల్ సౌత్ దేశాలపై పడుతోందని, ఇంధనం, ఎరువులు, ఆహార కొరతలకు ఇది కారణమవుతోందన్నారు. ఉక్రెయిన్‌కు భారత్ ఇప్పటివరకు 19 విడతల్లో 160 టన్నుల మానవతా సాయం అందించిందని జైశంకర్ తెలిపారు. ఇందులో జనరేటర్లు, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. ఉక్రెయిన్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థుల విషయంలో ఆ దేశ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

# జూనియర్ ప్రభుత్వ కళాశాలలో వేడుకలు పాల్గొన్న టీమ్స్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఫ్రెషర్స్ పార్టీ' వేడుకలు ఘనంగా సాగాయి. ఈ వేడుకలకు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష సతీష్ తో కలిసి ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించాలని, భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొవాలని ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి గారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శ్రీకాంత్ రెడ్డి ని, అతిధులను ఘనంగా సన్మానించడం జరిగింది.

# కాంగ్రెస్ పాలన 1000 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ కాంగ్రెస్ ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో ప్రజల పాలన సంబరాలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ తో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ ప్రజా పాలనా అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ప్ర భుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజల సంక్షేమం నుంచి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి వరకు.. వర్తమాన అవసరాల నుంచి భవిష్యత్ తెలంగాణ నిర్మాణం వరకు.. ఈ వెయ్యి రోజుల ప్రజా పాలన రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని అన్నారు. రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలకు భరోసా కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, వాటికి ప్రజలే సరైన సమాధానం చెబుతారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మిస్తూ సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.పాలుగొన్న వారు వెంకట్ యాదవ్,మాజీ జేపీటీసీ కొండా గంగాధర్,అభిషేక్ రెడ్డి,డీసీసీ ఉపా అధ్యక్షులు సుధాకర్ గౌడ్,ఎస్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుంద్ర నర్సింగ్,తంతోలి గ్రామ నాయకులు వీరయ్య,రాజేశ్వర్,దండు మధుకర్ ,నత్మరం,రాములు,రవి,వినోద్ రెడ్డి,పోచారెడ్డి,మరియు వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# వ్యవసాయ రంగ ఆధునీకరణతోనే రైతన్నకు మరింత మేలు : జిల్లా స్థాయి కిసాన్ మేళాలో ఎంపీ గోడం నగేష్




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్ పక్కన ఎమ్మెల్యే పాయల్ శంకర్ మరియు ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు సమష్టి కృషి అవసరమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మావల మండల కేంద్రంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో గురువారం ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం పి మాట్లాడుతూ, దేశ జనాభాలో సుమారు 80 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, జీడీపీలో వ్యవసాయ రంగం వాటా తక్కువగా ఉందని అన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు సంప్రదాయ సాగు విధానాలతో పాటు ఆధునిక సాంకేతికత, శాస్త్రవేత్తల సూచనలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలన్నారు. ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు, భూసారం, నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్‌పామ్‌తో పాటు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పెంచేందుకు ఎగుమతి అవకాశాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఒకే వేదికపై సమావేశమై ప్రభుత్వ పథకాలు, ఆధునిక సాగు విధానాలు, నూతన సాంకేతికతపై అవగాహన పొందేలా కిసాన్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో సేంద్రీయ వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు, డ్రోన్ సాంకేతికత వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ గిరిజన యువతకు డ్రోన్ ఆపరేషన్‌పై శిక్షణ అందించి, బ్యాంకు రుణాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా తక్కువ వడ్డీతో డ్రోన్లు, ద్విచక్ర వాహనాలు తదితర వ్యవసాయ అవసరాల కోసం రుణ సదుపాయాలు పొందవచ్చని రైతులకు వివరించారు. యాసంగిలో నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా కొత్త గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. రైతుల పొలాలకు రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు ప్రతి గ్రామంలో గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్లో 50 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించాలని కోరారు. అప్పుల భారంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, రైతులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు దళారులపై ఆధారపడకుండా మార్కెట్ యార్డులు, మార్కెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రభుత్వ పథకాలు రైతు కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం సాధించాలని రైతులకు సూచించారు. అనంతరం ముఖ్య అతిథులు కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు చెందిన స్టాళ్లతో పాటు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శనను సందర్శించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక యంత్రాల వినియోగం, రైతులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ బోథ్, ఇచ్చోడ ఆత్మ చైర్మన్లు సంతోష్ రావు, రాజు, నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, ఉద్యాన శాఖ అధికారి సందీప్ కుమార్, ఆర్డీఓ రాథోడ్ రవీందర్, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సంకల్ప్ ప్రాజెక్టు కింద రిమ్స్ చిన్న పిల్లల విభాగం ఎంపిక: కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ కేంద్ర ప్రభుత్వం ద్వారా అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న సంకల్ప్' ప్రాజెక్టు కింద ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగం ఎంపిక కావడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో IIHFW ఛైర్పర్సన్ డా. కవిత రెడ్డి సీలం తో కలిసి వైద్య శాఖ అధికారులతో సంకల్ప్ ప్రాజెక్ట్, రిమ్స్ లో వైద్య సేవలు, ఇతర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ ఆసుపత్రిలోని చిన్న పిల్లల విభాగంలో అందుతున్న వైద్య సేవలు, అక్కడ అందుబాటులో ఉన్న వసతులు, మౌలిక సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని అన్నారు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డా.రాథోడ్ జైసింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సాధన, ఇతర వైద్య బృందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు మోసం - కేసు నమోదు

-ఆర్అండ్‌బీ శాఖ లేదా కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు

-మోసమని గ్రహించిన తర్వాత పోలీసులను ఆశ్రయించిన బాధితుడు : ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడి వద్ద నుంచి రూ. 2 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడిన వ్యక్తిపై తలమడుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు. తలమడుగు మండలం కజ్జర్ల గ్రామానికి చెందిన కర్నేవార్ ప్రేమ్ (26) చదువు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో భరంపూర్ గ్రామానికి చెందిన నిందితుడు ఎం.డి. రఫీక్ ఏ మహ్మద్ రఫీక్ (42) తనకు ఆర్అండ్‌బీ శాఖలో లేదా కలెక్టరేట్‌లోని సెక్షన్-4లో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. రఫీక్ మాటలను నమ్మిన బాధితుడు 08-05-2026న తన నివాసం వద్ద రూ. 2 లక్షలు చెల్లించాడు. ఉద్యోగం ఇప్పిస్తానని సుమారు ఐదు నెలల పాటు బాధితుడిని నమ్మిస్తూ వచ్చిన రఫీక్ అనంతరం ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి, బాధితుడికి అందుబాటులో లేకుండా పోయాడు. పలుమార్లు రఫీక్ ఇంటికి వెళ్లినా డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకున్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తలమడుగు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 177/2026, సెక్షన్ 316(5), 318(4) BNS కింద కేసు నమోదు చేసి ఎస్సై డి రాధిక దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రహీం పాషా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మి మోసపోవద్దని, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల మాటలను నమ్మి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు సూచించారు.

# రైతులంతా క్రాప్ సర్వేలో పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో పంటల వివరాల నమోదు

ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలి అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



పత్తి రైతుల క్షేత్రాల్లో కలెక్టర్ పర్యటన



నిర్మల్ జిల్లా సారంగాపూర్ సెప్టెంబర్ 3 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లోని రైతులందరూ తమ సాగు, పంటల వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. గురువారం సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ గ్రామ శివారులో పొలాల్లో కొనసాగుతున్న క్రాప్ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, పంటల వివరాలు క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదైతే భవిష్యత్తులో ధాన్యం విక్రయాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే సహాయం, ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి అవసరమైన సహకారం అందించి, తమ పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. క్రాప్ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సిబ్బంది తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ సాగు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా క్రాప్ సర్వేను పూర్తి చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక యువతను వాలంటీర్లుగా నియమించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీఓ అజీజ్ ఖాన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీఈవో వినతి పత్రం అందజేస్తున్న టి యు టి ఎఫ్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలి

మహిళా ఉపాధ్యాయులకు 33% కంటే తక్కువ కాకుండా ప్రాతినిధ్యం కల్పించాలి - టి యుటిఎఫ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహించనున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టి యు టి ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలంధర్ రెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించిన వారు మాట్లాడుతూ, జిల్లాలోని 21 మండలాల నుంచి, మూడు కేడర్లలో ఒక్కొక్కరు చొప్పున, రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం మొత్తం 63 మందికి మించకుండా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఎలాంటి సంఘాల ఒత్తిళ్లకు, ఇతర ప్రభావాలకు తావులేకుండా, అభ్యర్థుల బోధనా సామర్థ్యం, విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషి, విద్యా రంగంలో అందించిన సేవలు, వినూత్న కార్యక్రమాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలని టి యుటిఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ప్రతి సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో మహిళా ఉపాధ్యాయులకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని పేర్కొన్నారు.

ఈ సంవత్సరం అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా, మొత్తం అవార్డు గ్రహీతల్లో కనీసం 33 శాతం మహిళా ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం కల్పించేలా ఎంపిక కమిటీకి తగిన సూచనలు చేయాలని కోరారు.

అర్హత, ప్రతిభ, సేవా నిబద్ధత ఆధారంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయడం ద్వారా అవార్డుల గౌరవం మరింత పెరుగుతుందని, ఎంపిక ప్రక్రియపై ఉపాధ్యాయుల్లో నమ్మకం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక ప్రక్రియను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు

# నాణ్యమైన విద్య, వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం:జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా




అమృత్ తెలంగాణ ఇచ్చోడా న్యూస్ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం బజార్హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని స్థానిక శాసన సభ్యులు అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు అతిథులకు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బజార్‌హత్నూర్‌లో ఎస్సీ, బీసీ హాస్టళ్ల నూతన భవనాల నిర్మాణానికి త్వరలోనే పరిపాలనాపరమైన అనుమతులు రానున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో త్వరలోనే బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని, కొల్హారిలో హరిరామ్, హరికృష్ణ అందజేసిన గోడౌన్‌ను ఇందుకు సద్వినియోగం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కటి వ్యక్తిగత వికాసం, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సమాచార మార్పిడి నైపుణ్యాలను పెంపొందించేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులతో పాటు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఖాన్ అకాడమీ ద్వారా డిజిటల్ విద్యనభ్యసించాలని సూచించారు. అలాగే కొత్త యూనిఫాంలు, షూలు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చి సబ్జెక్టులను క్షుణ్ణంగా అభ్యసించాలని, ప్రాథమిక స్థాయి నుంచే కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించేలా ఇప్పటి నుంచే లక్ష్యంతో కష్టపడి చదవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుంటే తల్లిదండ్రుల పేరుతో పాటు ఉపాధ్యాయులు, పాఠశాల పేరును కూడా నిలబెట్టవచ్చన్నారు. తాను సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని నేడు ఎమ్మెల్యే స్థాయికి వచ్చానని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్టిఫైడ్ ఉపాధ్యాయులు, అత్యుత్తమ బోధన అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చొరవతో జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని వెల్లడించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ, ప్రవైట్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని అన్నారు. తల్లితండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. బజార్హత్నూర్ మండలంలో పెండింగ్లో అభివృద్ధి పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీతకుమారి, ఏంఆర్ఓ శ్యాంసుందర్, ఎంపిడిఓ మహేందర్, సర్పంచ్ సాయన్న, ఏంఈఓ రాంకిషన్, ఏఏపిసి చైర్మన్ నవనీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న, వార్డెన్ చైతన్య, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, డి.ఎ.ఓ. రమేష్ లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో మార్కింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్.--2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుండెల్లో దేవుడిగా నిలిచిన వైఎస్సార్‌కు ఘన నివాళులు: టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ దుర్గం శేఖర్



కెవిపితో దుర్గం శేఖర్

అమృత్ తెలంగాణ న్యూస్ న్యూఢిల్లీలో జరిగిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి అవార్డు--2026 కార్యక్రమం సందర్భంగా, పేదల సంక్షేమం కోసం జీవితాంతం పరితపించిన మహానేత, ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిన స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి (వైఎస్సార్) కి టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌తో సన్నిహితంగా పనిచేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు డా. కె.వి.పి. రామచంద్రరావు (కేవీపీ) ని కలిసి, వైఎస్సార్ జ్ఞాపకాలను స్మరించుకున్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, సేవలు, పేద ప్రజల పట్ల చూపిన ప్రేమ నేటికీ కోట్లాది మంది హృదయాల్లో సజీవంగా ఉన్నాయని దుర్గం శేఖర్ పేర్కొన్నారు. "వైఎస్సార్ ఆత్మ నేడు కేవీపీ వంటి ఆత్మీయుల ద్వారా ప్రజల మధ్యే ఉందని, పేదల గుండెల్లో దేవుడిగా నిలిచిన మహానేత వైఎస్సార్‌కు ఇదే నిజమైన నివాళి" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని దుర్గం శేఖర్ పిలుపునిచ్చారు.

# బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ

## కేసీఆర్ వైఫల్యాలను ఎండగడుతూ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కదం తొక్కిన కార్యకర్తలు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఆడే గజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో సరికొత్త జోష్ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక, చర్యలను నిరసిస్తూ, కేసీఆర్ వెంటనే తన ప్రతిపక్ష హోదాకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో నిర్వహించిన బైక్ ర్యాలీ అత్యంత వైభవంగా, ఉత్సాహభరితంగా సాగింది. వందలాది బైక్‌లతో కాంగ్రెస్ శ్రేణులు తరలిరావడంతో నియోజకవర్గం మొత్తం హస్తం నినాదాలతో మారుమోగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించి, కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసి, ప్రజలను వంచించిన కేసీఆర్‌కు ప్రతిపక్ష నేతగా కొనసాగే అర్హత లేదని మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని, ఇందుకు నిరసనగా కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణను ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆడే గజేందర్ కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, రైతన్నలకు రుణమాఫీ అందిస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ రేవంత్ రెడ్డి గారు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని గడపగడపకూ ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీ ఇచ్చోడ, సిరికొండ మండల కేంద్రాల గుండా సాగుతుండగా స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులకు ఘనస్వాగతం పలికారు. ఆడే గజేందర్ నాయకత్వంలో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మారుస్తామని కార్యకర్తలు అత్యంత జోష్‌తో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి,సిరికొండ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్,జిల్లా అధికార ప్రతినిధి కొమరం కోటేశ్వర్,జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ పటేల్,జిల్లా సెక్రెటరీ బద్దం పురుషోత్తం రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ చవాన్ శేషారావు,బోథ్ నియోజవర్గ మైనార్టీ చైర్మన్ మహమ్మద్ ముస్తఫా,ముఖ్ర కె సర్పంచ్ జైపాల్ కోకాస్ మన్నూర్ సర్పంచ్ షేక్ షమీమ్ యూసుఫ్,సిరిచెల్మ సర్పంచ్ కాలా రవి,మాదాపూర్ సర్పంచ్ ఇమ్రాన్ షాదుల్లా,సుంకిడి సర్పంచ్ గణపతి,ఉప సర్పంచ్ రాజు,మాజీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్,మైనారిటీ చైర్మన్ రంజాన్,మాజీ ఎంపిటిసి ఎండి జాహీద్,మాజీ జిల్లా జనరల్ సెక్రెటరీ జి భీమ్ రెడ్డి,చోలే ప్రభాకర్,పట్ల గోవర్ధన్,మజీద్ ఖాన్ సిరిచెల్మ ఉపసర్పంచ్ షేక్ అజీమ్,కోకస్ మన్నూర్ ఉపసర్పంచ్ విష్ణు,పట్ల గోవర్ధన్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు నైతం నాగరాజు, సీనియర్ నాయకులు ఈశ్వర్, INTUC మండల అధ్యక్షులు మునేశ్వర్ కొటేష్, మాజీ బోథ్ అసెంబ్లీ అధికార ప్రతినిధి యండి సద్దాం, RGPRS సదానందం,ప్రవీణ్ పటేల్, మధుకర్, వెంకట్ రెడ్డి,రమణారెడ్డి, షేక్ జహీర్,రషీద్,సంజీవ్,సందీప్,రాజు,జాదో మాధవ్, షేక్ సిద్ధిక్,కిషన్ పటేల్, AMC డైరెక్టర్ ప్రకాశ్,రామారావు, ఎస్సీ సెల్ గైక్వాడ్ రాజు,రాజు, షేక్ సదిక్, అబ్దుల్ రషీద్, షేక్ వహీద్, లక్ష్మణ్, షేక్ ఫరూక్ కేంద్రీ వినాయక్, షేక్ మజార్, తొడసం భూపతి తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా చేపట్టే ఉపాధి పనులపై గ్రామసభ



నూతనంగా చేయబోయే ఉపాధి పనులపై గ్రామసభ

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి నందన్ సెప్టెంబర్ 3 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని నందన్ గ్రామ పంచాయతీ లో VBGRAM -G 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన చేయబోవు పనుల ఎంపిక కొరకు గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూన హేమలత , , టిఏ రవీందర్, , వార్డు సభ్యులు గ్రామ ప్రజలు , పాల్గొనటం జరిగింది. VBGRAM -G లో చేపట్టబోయే పనుల ఎంపిక జాబితాను (313) గ్రామపంచాయతీలో అతికించడం జరిగింది

# నిర్మల్ జిల్లాలో సందడిగా సాగిన పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు

## సామరస్య పద్ధతిలో నూతన కార్యవర్గం ఎన్నిక

## పోలీస్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేయాలి: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ జిల్లాలో పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో సందడిగా నిర్వహించబడ్డాయి. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని సామరస్య పద్ధతిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, వ్యవహరించారు. ఆయన పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పరిశీలించారు.

జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం
అధ్యక్షులు:దండేకర్ సాయి – పోలీస్ కానిస్టేబుల్
ఉపాధ్యక్షులు:కృష్ణ – ఇన్‌స్పెక్టర్
సాయి కృష్ణ – ఆర్ఎస్ఐ
కార్యదర్శి:శ్రీకాంత్ – ఎస్ఐ
ఆర్గనైజింగ్ సెక్రటరీ:రామ్ నిరంజన్ – ఆర్ఐ
జాయింట్ సెక్రటరీ:సంతోష్ – పోలీస్ కానిస్టేబుల్
కోశాధికారి:మాధవ్ – పోలీస్ కానిస్టేబుల్
ఎగ్జిక్యూటివ్ సభ్యులు : – మహేందర్ రెడ్డి – కానిస్టేబుల్
–సాయి కిరణ్ జాదవ్ – పోలీస్ కానిస్టేబుల్
–శంభు – పోలీస్ కానిస్టేబుల్
–గంగాధర్ – ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్
– పెర్సిస్ – ఎస్ఐ
– టి.వి. రమణ – ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పోలీస్ సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర సమయాల్లో అవసరమైన వైద్య సదుపాయాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి అసోసియేషన్ ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ సిబ్బందికి అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గం పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, ఏఓ యూనస్ అలీ, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సాయి కుమార్, గోవర్ధన్ రెడ్డి, ఆర్ఐ (అడ్మిన్) రామ్ నిరంజన్, జిల్లాలోని ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

## అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా అన్ని రకాల మౌలిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు






కాండ్లి అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులతో కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 3 అమృత్ తెలంగాణ గురువారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్రాలను పిల్లలను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలు, పెయింటింగ్స్, వర్ణమాల, విద్యా చార్టులతో అలంకరించి, ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యాబోధన అందించాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడేలా ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటలు, రైమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎత్తు, బరువు తదితర వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి

సామ్ , మామ్ కేటగిరీకి చెందిన పిల్లల వివరాలను పకడ్బందీగా నమోదు చేసి, పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి గర్భిణి, బాలింతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, పోషకాహార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారి పేర్లు, చదువు గురించి అడిగి తెలుసుకుని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి రావాలని సూచించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించి, సంఖ్యలు చదివించడంతో పాటు వారికి చాక్లెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, వైద్యారోగ్య శాఖ అధికారులు పవన్ కుమార్, సౌమ్య, నయనా రెడ్డి, రమేష్, అలీ, సర్పంచ్ హరీష్, ఉప సర్పంచ్ భూమేష్, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రామారెడ్డిలో ఇరువురి ఘర్షణ దాడిలో తీవ్రంగా గాయపడి తలకు తీవ్రంగా గాయాలైన సుప్పని రవి








కామారెడ్డి జిల్లా ప్రతినిధి/అమృత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు రవీందర్ గౌడ్ అతని తమ్ముడు రాజశేఖర్ గౌడ్ రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన సుప్పని రవీందర్ కి సంబంధించిన భూమిలోకి దౌర్జన్యంగా వచ్చి హైడార్ రాయి తో చంపే ప్రయత్నం చేశాడని తెలిపాడు. రామారెడ్డి గ్రామంలో 600 చదరపు గజాల ప్లాటు కలదని గతంలో నాకు మరియు మా గ్రామానికి చెందిన రంగుల రవీందర్ గౌడ్ అతని తమ్ముడు రాజాశేఖర్ గౌడ్ గొడవలు జరిగినాయనీ తేదీ సెప్టెంబర్ 3. 2026 రోజున నా యొక్క 600 చదరపు గజాల ప్లాట్ లో నేను హద్దురాళ్ళు పాతుకుంటుండగా అక్కడికి మాజీ సర్పంచ్ రంగు రవీందర్ గౌడ్ అతని తమ్ముడు రాజశేఖర్ గౌడ్ అన్నదమ్ములు కలిసి ఎలాగైనా ఈ రోజున నన్ను చంపేస్తామని అనుకుంటూ వచ్చి ఉద్దేశంతో అక్కడ గల హైదర్ రాళ్లతో ఇద్దరు నా వెనుక నుండి వచ్చి తలపై హైడర్ తో కొట్టడం జరిగిందని తెలిపాడు. అన్నదమ్ములు రంగు రవీందర్ గౌడ్ అతను తమ్ముడు రంగు రాశేఖర్ గౌడ్ పైన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. ఇట్టి విషయం పైన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. దయచేసి అధికారులు నాకు న్యాయం చేయాలని సుప్పని రవి కోరారు.

# నర్సాపూర్ జి మండల యూత్ అధ్యక్షున్ని సన్మానించిన భామ్ని వీడిసి సభ్యులు



నర్సాపూర్ జి మండల యూత్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న భామ్ని వీడిసి సభ్యులు

నిర్మల్ జిల్లా నర్సపూర్ జి భామ్ని, బి సెప్టెంబర్ 3 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గా నియమితులైన బామ్ని బి గ్రామానికి చెందిన కోస్లే దేవేందర్, ను గురువారం రోజు బామ్మి వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కర్యకమం లో మాజీ ఉప సర్పంచ్ ఖలీమ్ వీడీసీ సభ్యులు చాతల గంగన్న, భోజన్న, రఘువిర్ పటేల్, అవదుత్ పటేల్, ముత్యం, రాజు, విజయ్, అరవింద్ పటేల్, లు పాల్గొన్నాడం జరిగింది

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయండి

## నర్సాపూర్ జి ఎంపీడీవో పుష్పలత కు వినతి పత్రం అందజేసిన భామ్ని గ్రామస్తులు



పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయండి ఎంపీడీవో కు వినతి పత్రం అందజేసిన భామ్ని బి గ్రామస్తులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి సెప్టెంబర్ 3 అమృత్ తెలంగాణ నర్సాపూర్ మండలంలోని భామ్ని గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజురు చేయలని గురువారం రోజు నర్సపూర్ జి ఎంపీడీఓ పుష్పలత,కు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు,వీడీసీ సభ్యులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిం ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కలీం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవేందర్, సాయి దత్తు, భోజన్న రఘువీర్ పటేల్, పాల్గొన్నారు

# స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలి


అమృత్ తెలంగాణ : పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని, జాబ్‌చార్ట్ నిర్ణయించి అమలు చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంఈఓ జగపతి కి వినతిపత్రం సమర్పించారు.జీశీఎం ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో 'స్వచ్ఛమిత్ర' పేరుతో మహిళలను నియమించి పారిశుధ్య పనులతో పాటు ఎనిమిది గంటల పాటు వివిధ రకాల పనులు చేయిస్తున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రధానోపాధ్యాయుల తో సమానంగా బాధ్యతలు అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛమిత్రులకు గౌరవ వేతనంగా చెల్లిస్తున్న రూ.3 వేల నుంచే చీపుర్లు, ఫినాయిల్, బకెట్లు తదితర పారిశుధ్య పనిముట్ల కొనుగోలుకు కొంత మొత్తాన్ని ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం నిర్ణయించాలని, ఉపాధ్యాయుల మాదిరిగానే సంవత్సరంలోని 12 నెలలకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలను స్వచ్ఛమిత్రల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేయాలని, వారి విధులు, బాధ్యతలను స్పష్టంగా పేర్కొంటూ జాబ్‌చార్ట్ రూపొందించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, కౌలూరి రామకృష్ణ, లీల, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంకొండకు జోడీగా బాలీవుడ్ హాటీ!



'కందిరీగ' ఫేమ్ సంతోష్ శ్రీనివాస్ తో చేసిన 'అల్లుడు అదుర్స్' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోవడంతో బెల్లంకొండ శ్రీనివాస్ దృష్టి 'ఛత్రపతి' రీమేక్ వైపు మళ్లింది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా సక్సెస్ ఫుల్ చిత్రాల దర్శకుడు.. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన చిత్రం 'ఛత్రపతి'. 2005లో వచ్చిన ఈ చిత్రం ప్రభాస్ కెరీర్లో మాసీవ్ హిట్ గా నిలిచింది. ఇప్పుడు ఇదే చిత్రాన్నిబీటౌన్ లో జయంతిలాల్ గడ రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే.మాస్ చిత్రాల దర్శకుడు వి. వి. వినాయక్ తెరకెక్కిస్తున్న ఈ మూవీతో బెల్లంకొండ శ్రీనివాస్ బాలీవుడ్ లోకి అరంగేట్రం చేస్తున్నారు. ఇదే మూవీతో వివి వినాయక్ బి-టౌన్ లోకి ప్రవేశిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా సెట్ దెబ్బతినడంతో షూటింగ్ ని చిత్ర బృందం తాత్కాలికంగా వాయిదా వేసింది. అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికరమైన వార్త ఒకటి బయటికి వచ్చింది. ఇందులో బెల్లంకొండ సశ్రీనివాస్ కు జోడీగా బాలీవుడ్ హాటీని హీరోయిన్ గా చిత్ర బృందం ఫైనల్ చేసినట్టుగా చెబుతున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా బాలీవుడ్ హాటీ నుస్రత్ బరుచాను ఎంపిక చేశారు. ఈ డ్రీమ్ గర్ల్ పై రెండు రోజుల పాటు చిత్రీకరణ జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే మేకర్స్ మాత్రం ఈ వార్తలను అత్యంత రహస్యంగా ఉంచారు. తాజా నివేదికల ప్రకారం 'ప్యార్ కా పంచనామా 2'.. 'సోను కే టిటు కి స్వీటీ'లో నుస్రత్ బరుచా నటనను చూసిన తర్వాత వినాయక్ నుష్రత్ ని ఫైనల్ చేయాలని నిర్ణయించుకున్నాడట. బెల్లంకొండ.. నుష్రత్ ఇద్దరి మధ్య తెరపై మంచి కెమిస్ట్రీ పండుతుందని వినాయక్ భావించినట్లు తెలుస్తోంది. వినాయక్ ఇచ్చిన ఈ ఆఫర్ ఆమెకు వచ్చుడంతో నుష్రత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. నుష్రత్ 2010 లో విడుదలైన 'తాజ్ మహల్' చిత్రం ద్వారా టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది.

# నో పెళ్లీ.. ఓన్లీ ఎంజాయ్.. మాల్దీవుల్లో హన్సిక!



వయసు మీద పడుతున్నా చాలా మంది క్రేజీ హీరోయిన్ లు పెళ్లి మాట ఎత్తడం లేదు. ఈ జాబితాలో హన్సిక కూడా చేరింది. తమిళ స్టార్ హీరో శింబుతో పీకల్లోతు ప్రేమాయణం సాగించినా ఆ తరువాత ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో బ్రేకప్ చెప్పేసి కెరీర్ పై దృష్టి పెట్టింది. అయినా ఫలితం లేకుండా పోయింది. 'కోయీ మిల్ గయా' హిందీ చిత్రంతో చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ పాల బుగ్గల సోయగం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'దేశ ముదురు' చిత్రంతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.తొలి చిత్రంతో మంచి క్రేజ్ ని సొంతం చేసుకుంది. ఆ వెంటనే హిందీలో 'ఆప్ కా సురూర్' మళ్లీ తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ తో సినిమా.. ఇలా అటూ ఇటూ అంటూ తెలుగు- హిందీ- తమిళ- కన్నడ భాషల్లో ఎడా పెడా సినిమాలు చేసింది. కానీ తమిళ్ ఇండస్ట్రీలో సెట్టయిపోయింది. అయితే అక్కడ కూడా స్టార్ హీరోయిన్ గా మాత్రం నిలబడలేకపోయింది. కొంత కాలం ప్రేమాయణం కారణంగా కెరీర్ గాడి తప్పడంతో ఇప్పుడు మహిళా ప్రధాన థ్రిల్లర్ చిత్రాల్లో నటిస్తూ బండిని లాగించేస్తోంది. 'మహా' పేరుతో ఓ థ్రిల్లర్ డ్రామాలో నటించింది. ఇందులో మాజీ ప్రియుడు శింబు గెస్ట్ రోల్ లో నటించడంతో ఈ చిత్రంపై అంచనాలు ఏర్పడ్డాయి. ఇదిలా వుంటే ఏజ్ పెరుగుతున్నా 'నో పెళ్లీ' అంటూ హన్సిక మాల్దీవ్స్ లో ఎంజాయ్ చేస్తోంది. హాట్ హాట్ కలర్ ఫుల్ ఫొటోలని నెటిజన్ లతో పంచుకుంటూ ఆకట్టుకుంటోంది. తాజాగా హన్సిక షేర్ చేసిన ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి. ఈ ఫొటోలు చూసిన వారంతా నో పెళ్లీ.. ఓన్లీ ఎంజాయ్.. అంటూ కామెంట్ లు చేస్తున్నారు.

ఇంకా తొలి హీరో గుర్తున్నారు!

హన్సిక ఇటీవల ఇన్ స్టాగ్రామ్ లో తన అనుచరులతో చేసిన చిట్ చాట్ లో హన్సికను తన తొలి చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్ గురించి చెప్పమని ఒక అభిమాని అడిగాడు. "మధురమైన.. దయగల.. సరదా గల వాడు.. నా మొదటి సహనటుడు!" అని హన్సిక సమాధానమిచ్చింది. ఆపిల్ బ్యూటీ బన్నీని వర్ణించిన తీరుకు ఆ అభిమాని ఫిదా అయిపోయాడు. అల్లు అర్జున్ తన ఇన్ స్టా కథనాలను ఎంచుకుని హన్సికకు కృతజ్ఞతలు తెలిపాడు.. ధన్యవాదాలు స్వీటీ.. అంటూ ఉప్పొంగిపోయాడు. అయితే ఇప్పుడు హన్సిక ఉన్న స్టాటస్ లో తనకు బన్నీ లాంటి పెద్ద స్టార్ తో తెలుగులో కంబ్యాక్ అవసరం. మరి బన్నీ ఛాన్సిస్తున్నారా? అన్నది చూడాలి. ఇటీవల హన్సిక ఏమైపోయింది? చడీచప్పుడు లేనే లేదు? అసలు నటిస్తోందా లేదా? అంటూ కొందరు సందేహం వ్యక్తం చేశారు. శింబుతో ప్రేమాయణానికి బ్రేక్ పడిపోయాక కెరీర్ పరంగా ఎందుకనో స్లో అయ్యింది. కానీ ఇంతలోనే తిరిగి కెరీర్ ని ట్రాక్ లో వేయాలని గట్టి ప్లాన్ వేసింది.. ఇప్పుడు బన్ని ఏదైనా ఆఫరిస్తాడా? అంటూ హోప్ తో ఉంది. చూద్దాం.. ఏం జరుగుతుందో!

# కుర్రహీరోయిన్ ప్రయోగాలు షాకిస్తున్నాయిగా..!



రష్మిక మందన్న తెలుగు-హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ప్రస్తుతం రెండు హిందీ ప్రాజెక్ట్ ల్లో నటిస్తోంది. మిషన్ మజ్ను- గుడ్ బాయ్ సినిమాల షెడ్యూల్స్ సాగుతున్నాయి. ఈలోగానే మరో బాలీవుడ్ సినిమాకి సంతకం చేసింది. ఇక హిందీ సినిమాల కోసం ముంబైలో ఉండాల్సి రావడంతో రష్మిక ఓ ఖరీదైన ఏరియాలో ఒక అపార్ట్మెంట్ కొనుగోలు చేసింది. ఆమె తన సొంత ఇంట్లో ఉంటూ ఈ సినిమాల షూట్స్ ను పూర్తి చేస్తోంది. దినిపై మాట్లాడుతూ.. "నా వృత్తి కారణంగా నేను చాలా ప్రయాణాలు చేస్తున్నాను. నాకు ముంబైలో ఒక ఇల్లు ఉంది. ఇంటి నుండి షూటింగ్ కు వెళ్లడం చాలా బాగుంది. నేను ఎక్కువ కాలం హోటళ్లలో ఉండలేను" అని తెలిపింది. ఈ ఇంటి లోపలి భాగాన్ని తానే డిజైన్ చేశానని రష్మిక పేర్కొంది. ఇక తన కుటుంబం ఎప్పుడూ తనతోనే ఉండాలని కోరుకుంటోంది రష్మిక. తన సోదరికి మధ్య 16 సంవత్సరాల వయస్సు అంతరం ఉందని ఆమె చెప్పింది. అందువలన రష్మిక తన చెల్లెలికి తానే రెండవ తల్లిని అని తెలిపింది. మిషన్ మజ్ను చిత్రానికి శంతను బాగ్చి దర్శకత్వం వహిస్తున్నారు.




# నివేద పెథురాజ్ .. బ్యూటీ ఇన్ బ్లాక్ ..!



తమిళ చిత్రం 'ఓరు నాల్ కూతు'తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది నివేదా పేతురాజ్. మదురైకి చెందిన ఈ అందాల సోయగం యంగ్ హీరో శ్రీవిష్ణు నటించిన 'మెంటల్ మదిలో' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది. తొలి సినిమా మిశ్రమ ఫలితాన్ని అందించినా తన గ్లామర్ తో అవకాశాల్ని దక్కించుకుంది. సాయిధరమ్ తేజ్ తో 'చిత్రలహరి'.. శ్రీవిష్ణు నటించిన 'బ్రోచేవారెవరురా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపుని సొంతం చేసుకుంది.ఇక ఈ మూడు చిత్రాల తరువాత గురూజీ కంట్లో పడి ఇండస్ట్రీ హిట్ 'అల వైకుంఠపురములో' చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా ఛాన్స్ దక్కించుకుంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com